# హరీష్ ఇంపాక్ట్.. పాదయాత్రలో తగ్గని క్రేజ్



**దశ, మెదక్:** బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు చేపట్టిన పాదయాత్ర తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. సిద్ధిపేట జిల్లా మండల స్థాయిలో కాళేశ్వరం పంపులను వెంటనే ప్రారంభించి గోదావరి జలాలతో రంగనాయకసాగర్‌ను నింపాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన సుమారు 15 కిలోమీటర్ల పాదయాత్రకు రైతులు, ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

మండల స్థాయి కార్యక్రమానికే భారీగా ప్రజలు తరలిరావడంతో హరీష్ రావు ప్రజాదరణ, కేడర్‌పై ఉన్న పట్టుపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇదే తరహా పాదయాత్రను నియోజకవర్గం లేదా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తే దాని ప్రభావం మరింత ఎక్కువగా ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బీఆర్ఎస్ ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత పలువురు నేతలు పరిమిత రాజకీయ కార్యకలాపాలకే పరిమితమవుతున్న వేళ, హరీష్ రావు మాత్రం రైతు సమస్యలు, సాగునీటి అంశాలపై నేరుగా ప్రజల్లోకి వెళ్లడం ద్వారా తన రాజకీయ శైలిని కొనసాగిస్తున్నారు. సోషల్ మీడియా ప్రచారాల కంటే క్షేత్రస్థాయి ప్రజా ఉద్యమాలకే ప్రాధాన్యం ఇస్తున్నారనే అభిప్రాయం ఆయన అనుచరుల్లో వ్యక్తమవుతోంది. అయితే హరీష్ రావు ప్రతి రాజకీయ అడుగుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల్లో చురుగ్గా ఉంటే వ్యక్తిగత ఇమేజ్‌ను పెంచుకుంటున్నారనే విమర్శలు వస్తుండగా, కొంతకాలం మౌనం పాటిస్తే పార్టీ నాయకత్వంతో విభేదాలున్నాయనే ప్రచారం మొదలవుతోంది. ఈ రెండు పరిస్థితుల మధ్య ఆయన తన రాజకీయ కార్యాచరణను కొనసాగిస్తున్నారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తి, సాగునీటి సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకుని హరీష్ రావు పోరాటం కొనసాగిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సిద్ధిపేట పాదయాత్ర ద్వారా ప్రభుత్వం దృష్టిని రైతు సమస్యలపై మళ్లించడంతో పాటు, బీఆర్ఎస్ కేడర్‌కు కూడా కొత్త ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేశారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే హరీష్ రావు రాజకీయ అడుగులు, వాటి ప్రభావంపై భిన్న విశ్లేషణలు కొనసాగుతున్నప్పటికీ, ఆయనకు ఉన్న క్షేత్రస్థాయి ప్రజాదరణ మాత్రం మరోసారి ఈ పాదయాత్ర ద్వారా స్పష్టమైందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. రాబోయే రోజుల్లో ఆయన ఈ తరహా కార్యక్రమాలను విస్తరిస్తారా? బీఆర్ఎస్ నాయకత్వం వాటిని ఎలా వినియోగించుకుంటుంది? అనే అంశాలు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారాయి.

## కుక్కల దాడిలో మేకలు మృతి

❖ *బాధిత కుటుంబానికి రూ.20000 ఇరువై వేల రూపాయలు ఆర్థిక సాయం అందించిన వంగ రాజేశ్వర్ రెడ్డి*



**దశ, సిద్ధిపేట:** సిద్ధిపేట జిల్లా మిట్టపల్లి గ్రామంలో కుక్కల దాడిలో మేకలను కోల్పోయి తీవ్ర నష్టాన్ని చవిచూసిన కుటుంబానికి అండగా నిలిచి, ఆర్థిక భరోసా కల్పించిన వంగ రాజేశ్వర్ రెడ్డి. సిద్ధిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన గాంతి శ్రీను మేకలపై కుక్కలు దాడి చేయడంతో సుమారు 40కు పైగా మేకలు మృతి చెందిన విషాద ఘటనను తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి వెంటనే వారి నివాసానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మేకల మృతితో తీవ్ర ఆర్థిక నష్టం ఎదుర్కొంటున్న కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.20,000 ఆర్థిక సాయం అందజేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటనతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, ధైర్యం కోల్పోవద్దని, ఎల్లప్పుడూ తాము అండగా ఉంటామని వంగ రాజేశ్వర్ రెడ్డి భరోసా కల్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రజాపథం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: అరవింద్ కుమార్ గౌడ్



**దశ ఓయూ:** సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో తెలుగుదేశం పార్టీ చేపడుతున్న 'ప్రజాపథం' కార్యక్రమాన్ని ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో విజయవంతం చేయాలని టీడీపీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం. అరవింద్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆయనను తార్నాక డివిజన్ అధ్యక్షుడు గండికోట విజయ్‌కుమార్, మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడు తడక వినోద్‌కుమార్, సీనియర్ నాయకుడు విక్రమ్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ నల్లెల కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాపథం కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరినీ కలుపుకొని చురుకుగా పాల్గొనాలని సూచించారు. స్థానిక ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలకు టీడీపీ నాయకులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా పనిచేయాలని ఆయన కోరారు.

## సమాజంలో లయన్స్ క్లబ్ సేవలను విస్తరింపచేయాలి



**దశ, సూర్యాపేట ప్రతినిధి:** సమాజంలో లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తరింప చేయాలని లయన్స్ క్లబ్ ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్ కోడి సతీష్ కుమార్, సెకండ్ వైస్ డిస్టిక్ గవర్నర్ గుడిపూడి వెంకటేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్ లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో స్థానిక లయన్స్ సర్వీస్ సెంటర్ లో ఏర్పాటు చేసిన లైన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట స్పందన, ఎలైట్, స్ఫూర్తి క్లబ్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో వారు మాట్లాడారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన క్లబ్ సభ్యులు మంచి లక్ష్యాలను ఎంచుకొని సమాజ సేవలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు. అనంతరం లైన్స్ క్లబ్ ఆఫ్ స్పందన అధ్యక్షులుగా చీరాల వేణు, కార్యదర్శిగా వేదం శ్రీనివాస్, కోశాధికారిగా కుండం విష్ణు, లైన్స్ క్లబ్ ఆఫ్ ఎలైట్ అధ్యక్షరాలు గా మంచాల శ్రీనివాస్, సెక్రటరీగా పూర్ణ శశికాంత్, కోశాధికారిగా ఇమ్మడి శ్రీనివాస్, లైన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి అధ్యక్షులుగా మట్టిపల్లి సుమలత, కార్యదర్శిగా పగిళ్ల రేణుక, కోశాధికారిగా శోభా రాణిలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ తోట శ్యాం ప్రసాద్, నిమ్మల పిచ్చయ్య, మిరియాల సుధాకర్, ఉప్పల రాజేంద్రప్రసాద్, కొండ సంతోష్, త్రివేణి హరి, అలాసపోరి సుధాకర్, వెంపటి శబరినాథ్, యాదా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదిన వేడుకలు.. సైకిళ్ల పంపిణీ



**దశ, సూర్యాపేట ప్రతినిధి:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. రాంకోఠి సెంటినరీ వెస్లీ చర్చిలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు మేడే రాజీవ్ సాగర్, దేవీ ప్రసాద్‌రావు తదితరులు 50 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా అంబర్‌పేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకుడు శ్రీరాములు ముదిరాజ్ తన స్నేహితుడి సహకారంతో ప్రయాణికుల కోసం బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో హెల్మెట్‌లు పంపిణీ చేశారు.



## హుజురాబాద్‌లో కాలకూట విషమా..?

❖ *కల్తీ పాలపై పెరుగుతున్న అనుమానాలు*

**దశ, హుజురాబాద్:** హుజురాబాద్ ప్రాంతంలో విక్రయిస్తున్న పాల నాణ్యతపై వినియోగదారుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కల్తీ పాలు, నాణ్యత లేని పాల విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద డైరీల నుంచి చిన్న డైరీల వరకు నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల చిన్నారులు, వృద్ధులు, సాధారణ వినియోగదారుల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

హుజురాబాద్‌లో రెండు ప్రధాన డైరీలతో పాటు అనేక చిన్న పాల సేకరణ కేంద్రాలు, డైరీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. అయితే స్థానికంగా ఉత్పత్తి అయ్యే పాల పరిమాణం కంటే విక్రయాలు అనేక రెట్లు ఎక్కువగా ఉండటంతో పాల మూలాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు డైరీలు పాలపొడి, ఇతర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా తెచ్చిన పాలను విక్రయిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ పాలలో నాణ్యతను కాపాడేందుకు లేదా పాలు చెడిపోకుండా ఉండేందుకు రసాయనాలు కలుపుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ లేదు.

హుజురాబాద్‌లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఓ ప్రముఖ డైరీపై గతంలో కూడా వివాదాలు నెలకొన్నాయని స్థానికులు చెబుతున్నారు. అదే విధంగా భీమదేవరపల్లి మండలంలోని ఓ సహకార డైరీలో ఆర్థిక వ్యవహారాలపై కూడా సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. సహకార సంఘంగా వచ్చిన లాభాలను సభ్యులకు పూర్తిగా పంపిణీ చేయకుండా అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై సంబంధిత యాజమాన్యం స్పందించాల్సి ఉంది.

మరోవైపు చిన్న డైరీలలో కూడా నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. పాలు ఎక్కువసేపు నిల్వ ఉండేందుకు రసాయనాలు కలుపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై పర్యవేక్షణ చేయాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు తగిన తనిఖీలు నిర్వహించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారుల నుంచి ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు.

కల్తీ లేదా నాణ్యతలేని పాలను సేవించడం వల్ల చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు ఎక్కువగా ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల పాల నాణ్యతపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు త్వరగా పూర్తి చేయాలి

❖ *అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి*

**దశ, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి జిల్లా విద్యాశాఖ పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భౌతిక నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మండల విద్యాధికారులకు ఆదేశించారు. ప్రతి మండల విద్యాధికారి తమ పరిధిలోని ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల భౌతిక డేటాను సేకరించాలని, ఆ వివరాలను యూడైస్ (UDISE) నమోదుతో సరిపోల్చి వ్యత్యాసాలను వెంటనే సరిచేయాలని సూచించారు. అలాగే ప్రీప్రైమరీ, కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల సంఖ్య తగ్గి జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలుగా మారడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్న అడిషనల్ కలెక్టర్, మండల విద్యాధికారులు పాఠశాలలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరు, ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదును పరిశీలించిన ఆమె, ఎంఆర్సీల్లో సీఆర్పీల హాజరు తక్కువగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. పాఠశాలల్లో జరుగుతున్న సివిల్ పనులపై కూడా సమీక్ష నిర్వహించిన డాక్టర్ కిరణ్మయి, ప్రతి పాఠశాలలో మరుగుదొడ్ల సౌకర్యం ఉండేలా చూడాలని, దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక టాయిలెట్లు నిర్మించాలని సూచించారు. ప్రతి నెలా ఇలాంటి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తానని, మండల విద్యాధికారులు పూర్తి సమాచారంతో సమావేశాలకు హాజరుకావాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్లు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.




## డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య.. డైరీలో భావోద్వేగ సందేశం



**దశ, హైదరాబాద్:** తెలంగాణ డీజీపీ కార్యాలయంలో గురువారం తెల్లవారుజామున విషాద ఘటన చోటుచేసుకుంది. డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న స్వామి ఆఫీస్ ప్రాంగణంలోని వాష్‌రూమ్‌లో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం ప్రకారం, బుధవారం రాత్రి విధుల్లో ఉన్న స్వామి గురువారం ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో వాష్‌రూమ్‌లోకి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత తుపాకీ శబ్దం వినిపించడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని చూడగా ఆయన రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించగా, పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

ప్రాథమిక విచారణలో కుటుంబ సంబంధిత సమస్యల కారణంగా స్వామి తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అయితే ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలపై విచారణ కొనసాగుతోంది. దర్యాప్తులో భాగంగా స్వామి వ్యక్తిగత డైరీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో తన మరణానికి ఎవరినీ బాధ్యులుగా చూడవద్దని, తన భార్యా పిల్లలను ఎవరూ ఇబ్బంది పెట్టవద్దని కోరినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబంపై తనకున్న ప్రేమను వ్యక్తం చేస్తూ, "నేను ఈ లోకం నుంచి వెళ్లిపోయినా... చనిపోయిన తర్వాత దెయ్యంగా మారైనా నా కుటుంబాన్ని ఎప్పుడూ కాపాడుకుంటాను" అని ఆయన రాసినట్లు సమాచారం. ప్రస్తుతం పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ ఆధారాలు, కుటుంబ సభ్యులు, సహచరుల వాంగ్మూలాల ఆధారంగా ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఓటర్ నమోదు ప్రక్రియను 100 శాతం పూర్తి చేయండి

❖ *48 వ వార్డులో SIR ప్రక్రియను పరిశీలించి బిఎల్ఓ లకు సూచన చేసిన పటేల్ రమేష్ రెడ్డి.*

**దశ సూర్యాపేట ప్రతినిధి :** ఓటు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాల్సిన బాధ్యత బీఎల్ఓలు, బీఎల్ఏలపై ఉందని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 48 వ వార్డులో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరికి అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. నిజమైన అర్హులైన ఓటర్ల పేర్లు ఎలాంటి పరిస్థితుల్లోనూ తొలగిపోకుండా చూడాలని, అవసరమైన పత్రాలతో ప్రతి ఒక్కరూ సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేస్తూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగంగా, పారదర్శకంగా 100 శాతం పూర్తి చేయాలని కోరారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 48 వ వార్డు కౌన్సిలర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పిల్లల రమేష్ నాయుడు, పాలగాని కృష్ణ, వల్దాస్ దేవేందర్, తండు శ్రీనివాస్ గౌడ్, అరవింద్, జానీ, బి ఎల్ వో లు, అంగన్ వాడీ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## నీట్ వ్యవహారంపై బంద్‌కు మద్దతు ప్రకటించిన ఏఐవైఎఫ్

❖ జూలై 24 విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపు



**దశ, ఓయూ:** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులు, యువతపై పోలీసుల చర్యలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. జూలై 24న విద్యార్థి సంఘాలు నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌కు ఏఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ గురువారం ఈసీఐఎల్‌లో గోడపత్రికను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సల్మాన్ బేగ్, జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో వరుసగా ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు చోటుచేసుకోవడం వల్ల విద్యార్థుల్లో ఆందోళన పెరుగుతోందన్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పనితీరుపై సమగ్ర సమీక్ష చేపట్టాలని కోరారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై పోలీసుల చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ఘటనపై నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, యువత, మేధావులు జూలై 24న నిర్వహించే విద్యాసంస్థల బంద్‌కు సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు గిరిబాబు, శేఖర్, వికాస్ రెడ్డి, మల్లేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కో మొక్క.. భవిష్యత్ తరాలకు భరోస

❖ సూర్యాపేట పట్టణ సీఐ వెంకటయ్య



**దశ సూర్యాపేట ప్రతినిధి :** పర్యావరణ పరిరక్షణే ప్రతి ఒక్కరి బాధ్యత అని పట్టణ సీఐ వెంకటయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రం పాత ఎస్పీ కార్యాలయ ఆవరణలో వి ఆర్ డి ఆర్ ఇండోర్ స్టేడియం ఇంచార్జ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్బాస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలన్నారు.ఈ సందర్భంగా సీఐ వెంకటయ్య మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల పాత్ర ఎంతో కీలకమని అన్నారు.ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. దేశవ్యాప్తంగా పోలీసులు కూడా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారని తెలిపారు.పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వారు పిలుపునిచ్చారు.

## రాహుల్ గాంధీ అరెస్ట్ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

❖ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ ఫతే అహ్మద్

**దశ, కామేపల్లి:** నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటనపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ, పార్టీ ఎంపీలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నివాసం ఎదుట చేపట్టిన శాంతియుత నిరసన సందర్భం గా రాహుల్ గాంధీని పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, షేక్ ఫతే అహ్మద్ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన కామేపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిర్వహిం చిన నిరసన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగిస్తూ..నీట్ పరీక్షలో జరిగిన అవకతలపై ప్రశ్నిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేసిన ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు విమర్శించారు. దేశ యువత భవిష్యత్తుతో ముడిపడిన అంశంపై సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం,నిరసన తెలిపిన నాయకులను అనిచివేసే ప్రయత్నం చేయడం బాధాకరమని అన్నారు.

# సూర్యాపేటను దేశంలోనే నంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

❖ పేట ప్రజల దాహార్తిని తీర్చేందుకు త్వరలో దోసపాడు ప్రాజెక్టు పునఃప్రారంభం.

❖ 24 వ వార్డులో 5 లక్షల వ్యయంతో మురికి కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది.



**దశ, సూర్యాపేట ప్రతినిధి:** సూర్యాపేట మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శవంతమైన, నంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 24వ వార్డు సీతారాంపురం ప్రాంతంలో మున్సిపల్ సాధారణ నిధుల ద్వారా మంజూరైన 5 లక్షలతో మురికి కాలువ (డ్రైనేజీ) నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా వార్డుకు విచ్చేసిన చైర్‌పర్సన్‌కు 24వ వార్డు కౌన్సిలర్ మన్నెం అరుణ మల్లేష్ లు శాలువాతో ఘనంగా సన్మానం చేసి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పట్టణంలోని శివారు ప్రాంతాలతో పాటు అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సూర్యాపేటను నిర్మించేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న వేసవికాలంలో నీటి ఎద్దడిని నివారించేందుకు దోసపాడు ప్రాజెక్టును పునరుద్ధరించి, సూర్యాపేట ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం అందించే దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. సూర్యాపేట సమగ్ర అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాలకు భాగస్వాములు కావాలని చైర్‌పర్సన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనగా కేటీఆర్ జన్మదిన సేవా కార్యక్రమాలు

❖ పాల్గొన్న బీఆర్ఎస్ నాయకురాలు వగ్గెల పూజ

**దశ, అశ్వారావుపేట:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ 50వ జన్మదినం సందర్భంగా అశ్వారావుపేట మండలం రెడ్డిగూడెం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో, వెన్నెల హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన 'గిఫ్ట్ ఏ స్మైల్' ఉచిత వైద్య శిబిరంలో బీఆర్ఎస్ నాయకురాలు వగ్గెల పూజ పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు కాసాని చంద్రమోహన్-పద్మ, డాక్టర్ భూక్యా ప్రసాద్ రావు-ఉదయ్ జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో వైద్య సేవల కోసం వచ్చిన పేదలకు వగ్గెల పూజ పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రోగుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, వైద్య సేవలు అందించిన వైద్యులను సన్మానించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని నిర్వాహకులను అభినందించారు.



## గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం: వొడితల ప్రణవ్

❖ రవాణా వ్యవస్థ ద్వారా గ్రామాలకు కనెక్టివిటీ పెంచుతున్నాం

**దశ, హుజురాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఉచిత బస్ సౌకర్యాన్ని కల్పించామని,మహిళల చుట్టే కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.గురువారం రోజున జమ్మికుంట నుండి గద్ధపాక వరకు నడిచే బస్ సర్వీసును బొంతుపల్లి గ్రామంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రణవ్ కు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు,అనంతరం మహిళలతో కలిసి టికెట్ తీసుకొని బస్ లో ప్రయాణించారు.మహాలక్ష్మీ,ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని మహిళలను అడగగా అందుతున్నాయని చాలా సంతోషంగా ఉన్నామని వారు తెలిపారు.అంతకుముందు ఇదే గ్రామంలో 8 లక్షల ఎస్డియఫ్ నిధులతో నిర్మించిన కల్వర్టును ప్రణవ్ ప్రారంభించారు.ఈ కల్వర్టు ద్వారా సుమారు 60 ఎకరాల పై చిలుకు రైతులకు ఇది ఉపయోగపడుతుందని,ఈ విషయంపై హుజురాబాద్ ఇంచార్జి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే మంజూరు చేపించిన ప్రణవ్ కు గ్రామస్థులు,రైతులు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ముందుకు వెళ్తున్నారని,ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలకు ప్రయోజనం చేకూరే పనులు చేస్తున్నామని,గ్రామాల్లో రవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని దీన్ని గ్రామాల ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.ఈ సర్వీసు మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,జిల్లా ఇంచార్జి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వీణవంక మండల శాఖ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సూర్యాపేటకు బుల్లెట్ రైల్వే లైన్ సాధించే వరకు పోరాటం

❖ రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసిరావాలని ఎంసీపీఐ(యూ) నేత వెంకన్న పిలుపు



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన శంషాబాద్ సూర్యాపేట-చెన్నై బుల్లెట్ రైల్వే కారిడార్‌ను అమలు చేసే వరకు రాజకీయాలకు అతీతంగా పోరాటం కొనసాగించాలని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు వరికుప్పల వెంకన్న పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో షేక్ నజీర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మిర్యాలగూడ మాజీ ఎంపీ భీమిరెడ్డి నరసింహారెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి పార్లమెంట్‌లో పోరాడి బీబీనగర్-నడికుడి రైల్వే మార్గాన్ని సాధించారని గుర్తు చేశారు. అలాగే శ్రీరాంసాగర్ రెండో దశ కాలువ కోసం కూడా ఆయన చేసిన కృషిని స్మరించారు.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అనేక మంది రైల్వే మంత్రులు, ఎంపీలు మారినా సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన శంషాబాద్-సూర్యాపేట-చెన్నై రైల్వే కారిడార్‌ను అమలు చేసి, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా సూర్యాపేటకు బుల్లెట్ రైల్వే లైన్ వచ్చే వరకు ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు ఏపూరి సోమన్న, శ్రీనివాస్, నలుగురి రమేష్, కందుకూరి మహేష్, వేముల పెద నర్సయ్య, బచ్చు కోటయ్య, మోరపాక ఉగ్రయ్య, లింగంపల్లి రాజు, ఓంకార్, శ్రీరామోజు ఉమేష్, వైభవ్ తదితరులు పాల్గొన్నారు.





## బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నాచారంలో జెండా ఆవిష్కరణ.. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

**దశ ఓయూ:** భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్) ఆవరణలో గురువారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై బీఎంఎస్ జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద స్వతంత్ర కార్మిక సంఘంగా బీఎంఎస్ గుర్తింపు పొందిందని, ఎలాంటి రాజకీయ అనుబంధం లేకుండా కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. "దేశహితం కోసం పని చేస్తాం - పనికి తగిన ప్రతిఫలం పొందుతాం" అనే నినాదంతో కార్మికుల్లో దేశభక్తి, కర్తవ్యనిష్ఠ, బాధ్యతాయుతమైన హక్కుల సాధనకు బీఎంఎస్ కృషి చేస్తోందని పేర్కొన్నారు.

సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం పోరాటం కొనసాగిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పోతగాని గోపాల్ గౌడ్, ఉపాధ్యక్షుడు యాదగిరి, హరిప్రసాద్, యు. శ్రీనివాస్, కే. అనురాధ, బి. వాసుదేవులు, బి. కొమరయ్య, కే. రామ్, కే. శంకర్, చంద్రమౌళి, బాలరాజ్ గౌడ్, ఎన్. లక్ష్మి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, మీర్పేట్ డివిజన్ అధ్యక్షుడు రాంప్రదీప్, మల్లాపూర్ బీజేపీ నాయకులు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గంగిశెట్టి రవీంద్ర సాగర్‌తో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## సూర్యాపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించొద్దు

❖ RTC అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా ఎస్పీ నరసింహ.



**దశ, సూర్యాపేట ప్రతినిధి:** సూర్యాపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ నరసింహ అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ విషయంలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. గురువారం సూర్యాపేట పట్టణ సీఐ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి, ఆర్టీసీ సీఐ సైదులు తదితర అధికారులతో కలిసి ఎస్పీ సూర్యాపేట ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. బస్టాండ్‌లో బస్సుల రాకపోకల వల్ల తలెత్తుతున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రయాణికులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా బస్టాండ్‌కు రెండు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం బస్సులు నేరుగా ప్రధాన రహదారిపైకి రావడం వల్ల రహదారిపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నెల రోజుల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని, అయినప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే పోలీసు శాఖే స్వయంగా రంగంలోకి దిగి చర్యలు చేపడుతుందని ఎస్పీ హెచ్చరించారు. బస్టాండ్ పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటాన్ని గమనించిన ఎస్పీ, వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

ఇటీవల ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ నేపథ్యంలో బస్టాండ్ వద్ద ప్రయాణికులు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో సూర్యాపేట పట్టణ సీఐ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి, ఆర్టీసీ సీఐ సైదులు, ఆర్టీసీ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.